క్లుప్తంగా

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



పమిడిముక్కల: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని విశ్రాంతి ఉద్యోగుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.యోబు, బి.వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ నవీన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలని పేర్కొన్నారు. 11వ పీఆర్సీ బకాయిలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఆ సంఘ నాయకులు యడ్ల దుర్గారావు, పి.చంద్రపాల్, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీల దుమ్ము నుంచి కాపాడండి



తోట్లవల్లూరు: ఇసుక లారీల తాకిడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దుమ్ము కాలుష్యం నుంచి తమను కాపాడాలని తోట్లవల్లూరు సర్పంచ్ పెనుమత్స రాధిక అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై తహసీల్దార్ ఎం.కుసుమకుమారిని సోమవారం ఆమె కలిసి వినతిపత్రం అందజేశారు. వందలాదిగా వస్తున్న ఇసుక లారీలతో ప్రధాన రహదారి అధ్వానంగా మారుతోందని పేర్కొన్నారు. వంతెన సెంటర్ నుంచి కనకదుర్గ కాలనీ వరకు ఆర్ అండ్ బీ రహదారిని రోజుకు ఐదారు సార్లు వాటరింగ్ చేయించటంతోపాటు రాత్రిళ్లు ఇసుక రవాణ జరగకుండా చూడాలని ఆమె కోరారు.

ఘనంగా మహాయోగిని బ్రహ్మోత్సవాలు



పమిడిముక్కల: పెనుమత్స మహాయోగిని ఆలయంలో మూడు రోజులుగా మహాయోగిని అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారి సన్నిధిలో సోమవారం 365 శివలింగాలకు ఆవుపాలతో, పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరు హైస్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని పక్కిరి అమూల్య రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో సత్తా చాటింది. వైఎస్సార్ జిల్లా పులివెందులలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ పోటీల్లో అమూల్య ప్రతిభ చాటి తృతీయ స్థానం సాధించినట్లు హెచ్ఎం శొంఠి రామోజీరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు వేముల వెంకటేశ్వరరావు తెలిపారు. అమూల్యను ఉపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మన్ శీలం వెంకటశ్యామల, వైస్ చైర్మన్ కుర్మా లాజరు, కమిటీ సభ్యులు అభినందించారు.

ఆలయాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం



గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం, స్థానిక శ్రీ గంగానమ్మ ఆలయాల అభివృద్ధి పనులకు రూ.లక్షను దాతలు చాపరాల అప్పారావు కుమారులు విజయ, సౌమ్య, కిరణ్, జ్యోతి అందించారు. సోమవారం ఈ విరాళాన్ని నెహ్రూ పశువుల సంత కమిటీ కార్యదర్శి ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావుకు దాతలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కొప్పురావూరి రవి, మురాల నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



కైకలూరు: విద్యార్థులకు ఒంటి పూట బడులు ముగింపు వరకు మధ్యాహ్న భోజనం తర్వాత ఒక గ్లాసు మజ్జిగ అందించేందుకు ముందుకు వచ్చిన దాతకు వదర్లపాడు పాఠశాల హెచ్ఎం మార్నెళ్ల రవిశంకర్ సోమవారం అభినందనలు తెలిపారు. గ్రామానికి చెందిన వడుపు శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో రోజూ మజ్జిగను విద్యార్థులకు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా దాతకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లను తవ్వేస్తున్నారు





కైకలూరు 9వ వార్డు రోడ్డులో రెండు పైపులతో ఏర్పాటు చేసిన రెండు స్పీడ్ బ్రేకర్లు

- అనుమతులు లేకుండా రోడ్లు ధ్వంసం
- వాహనదారుల ఇక్కట్లు

కైకలూరు: పంచాయతీ రోడ్లను ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. గృహాల నుంచి రోజువారీ వాడకం నీరు డ్రెయిన్లలో చేరడానికి రాత్రి సమయంలో భారీ పైపులు పెడుతున్నారు. పైపులు పాడవకుండా ఎత్తుగా సిమెంటు పోస్తున్నారు. అవి స్పీడ్ బ్రేకర్లుగా మారుతున్నాయి. ఆ రహదారిలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు తరుచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇటీవల ఈ పరిస్థితి ప్రతి వీధిలోనూ కనిపిస్తోంది. కై కలూరు ఫైర్ స్టేషన్ రోడ్ నుంచి నేషనల్ స్కూల్ మీదుగా వెళ్లే పంచాయతీ రోడ్ ఎంతో కీలకమైంది. ప్రతి రోజూ పాఠశాల బస్సులు వస్తాయి. గాంధీ బొమ్మ సెంటర్, కలిదిండి రోడ్ చేరడానికి దగ్గరి మార్గం కావడంతో వాహనదారులు ఎక్కువగా ఈ రోడ్డును వినియోగిస్తారు. ఈ రోడ్డులో ఆరు స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. అన్నీ పైపులైన్లకు సంబంధించినవే. ఒకే ఇంటిలో రెండు పైపులను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల స్పీడ్ బ్రేకర్లపై పలువురు ఫిర్యాదులు చేశారు.

నిబంధనలు పాటించడం లేదు

పంచాయతీ నిబంధనల ప్రకారం పంచాయతీ రోడ్డును ధ్వంసం చేసి పైపులైన్లు ఏర్పాటు చేయాలంటే ముందుగా పంచాయతీ అధికారుల అనుమతులు తీసుకోవాలి. వాహనదారులకు ఎటువంటి నష్టం కలిగించకుండా జాగ్రత్తలు పాటించాలి. తిరిగి పూడ్చే బాధ్యత తీసుకోవాలి. అదే ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవేలకు ఈ నిబంధనలు మరింత కఠినతరంగా ఉంటాయి. కైకలూరు పంచాయతీలో 20 వార్డులు ఉన్నాయి. అనేక వార్డుల్లో పైపులైన్లు ఏర్పాటు చేసి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాలల వద్ద పిల్లల రక్షణ కోసం స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి బోర్డులు సూచించేవారు. స్పీడు బ్రేకర్ల వలన ఉపయోగాల కంటే ప్రమాదాలు ఎక్కువవడంతో కోర్టులు వీటి ఏర్పాటును తప్పుపట్టాయి.

వాహనదారులకు తప్పని ఇక్కట్లు

పంచాయతీ రోడ్లపై ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్న స్పీడ్ బ్రేకర్ల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు స్పీడ్ బ్రేకర్ల వల్ల నడుం నొప్పులతో బాధపడుతున్నామని పలువురు వాహనదారులు వాపోతున్నారు. పంచాయతీ అధికారుల ఉదాశీనత వల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమవుతోందని చెబుతున్నారు. ఇప్పటికే కైకలూరు పంచాయతీలో అనేక మంది డ్రెయిన్లు ఆక్రమించి పక్కా కట్టడాలు నిర్మించారు. నూతన భవనం నిర్మాణ సమయంలో పంచాయతీ స్థలాలను దర్జాగా ఆక్రమించేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు పైపుల ఏర్పాటు మధ్య రోడ్లుకు అడ్డంగా ఏర్పాటు చేస్తున్న స్పీడ్ బ్రేకర్లను నిర్మూలించాలని గ్రామస్తులు కోరుతోన్నారు.

చర్యలు తీసుకోవాలి



రోజూ పంచాయతీ వీధిలో వివిధ పనుల మీద వాహనంలో ప్రయాణిస్తున్నా. నేషనల్ స్కూల్ నుంచి ఫైర్‌స్టేషన్ చేరే వీధిలో ఎక్కువగా రోడ్లపై పైపులైన్లు ఏర్పాటు చేశారు. అవి పాడవకుండా సిమెంటుతో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. పిల్లలతో వెళుతున్న అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చిట్టూరి చంద్రశేఖర్, ఉపాధ్యాయుడు, కైకలూరు

కేసులు నమోదుకు సిఫార్సు



పంచాయతీ అనుమతులు లేకుండా రోడ్లకు నష్టం కలిగించే వారిపై కేసుల నమోదుకు సిఫార్సు చేస్తాం. నోటీసులు అందిస్తాం. ప్రజల సౌకర్యం కోసం రూ.లక్షల ప్రజా ధనంతో రహదారులు నిర్మిస్తున్నారు. వాటిని పాడు చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

–ప్రత్తిపాటి ఆనంద భూషణం, పంచాయతీ కార్యదర్శి, కైకలూరు

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం



తోట్లవల్లూరు పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



పమిడిముక్కలలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



ముదినేపల్లి పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబరును పరిశీలిస్తున్న విద్యార్థులు

తోట్లవల్లూరు: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. తొలి రోజు తెలుగు పరీక్షకు తోట్లవల్లూరు కేంద్రంలో 102 మంది, పెనమకూరు కేంద్రంలో 76 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆయా కేంద్రాలను ఎంఈఓ-2 సురేష్ సందర్శించి పరీక్షల తీరును పరిశీలించారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలోని తాడంకి, కపిలేశ్వరపురం, పమిడిముక్కల, మేడూరు పరీక్ష కేంద్రాల్లో సోమవారం పదో తరగతి తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. నాలుగు కేంద్రాల్లో 420 మంది విద్యార్థులకు గాను ఇద్దరు గైర్హాజరైనట్లు ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: పట్టణంలోని 15 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం 3,524 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 33 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలో సోమవారం నిర్వహించిన టెన్త్ పబ్లిక్ పరీక్షలకు కొన్ని అనివార్య కారణాల వలన ఒకే ఒక్కరు గైర్హాజరయ్యారు. మండలంలో 505మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 504 మంది హాజరైనట్లు ఎంఈఓ-1 జగన్‌మోహన్ రావు, ఎంఈఓ- 2 గోపాలరావు తెలిపారు.

కైకలూరు నియోజకవర్గంలో 52 మంది గైర్హాజరు

కైకలూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలక సంబంధించి నియోజకవర్గంలో కై కలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 2,655 మంది విద్యార్థులకు గాను 2,603 మొదటి రోజు పరీక్షలకు హాజరుకాగా 52 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరిగాయి. పరీక్ష కేంద్రాల్లో ఉదయం 8.45కే విద్యార్థులను అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను పోలీసులు అమలు చేశారు.


పామర్రులో..

పామర్రు: మండలంలో పామర్రు జెడ్పీ, అసీసీ, ఏఎస్ఎం, అడ్డాడ హైస్కూల్, నిమ్మకూరు ఏపీఆర్ హైస్కూల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 720 మందికి నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. స్థానిక అసీసీ హైస్కూల్‌ను పామర్రు ఎంఈఓ-2 పద్మవాణి పరిశీలించారు.నిమ్మకూరు ఏపీ గురుకుల పాఠశాల్లో పదో తరగతి పరీక్షలను ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ పరిశీలించారు.

వెంట్రప్రగడలో..

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ, యలమర్రులోని హైస్కూలో పదో తరగతి పరీక్షలు సోమవారం నిర్వహించారు. మండలంలో మొత్తం 204 మంది విద్యార్థులకుగాను 203 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు.

కూటమి ప్రభుత్వంపై కౌలుదారుల వ్యతిరేకత



వినతిని పత్రం అందిస్తున్న దృశ్యం

గుడ్లవల్లేరు: కూటమి ప్రభుత్వంపై కౌలు రైతులు వ్యతిరేకంగా ఉన్నారని ఆ సంఘ జిల్లా కార్యదర్శి పి.రంగారావు అన్నారు. సోమవారం కౌలు రైతులకు యజమాని సంతకం నిబంధన తొలగించి ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టం చేయాలని మండలంలో చంద్రాల, అంగలూరు గ్రామాల్లోని సచివాలయాల వద్ద అధికారులకు కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాలు సమర్పించారు. సీపీఎం మండల నాయకుడు బి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ సమస్యపై కౌలు రైతులందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. మినుము రూ.9,200 రేటు చొప్పున బోనస్ కలిపి ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం 30శాతం మాత్రమే కొన్నారన్నారు. ఇంకా మిగిలిన ధాన్యాన్ని కొనాలని కోరారు. అంగలూరు నాయకులు చిలుముల రాధాకృష్ణ, కొడాలి నాని, పి.జాన్సన్, చంద్రాల నాయకుడు మదిరి నాగరాజు పాల్గొన్నారు.

నేడు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

కైకలూరు: కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు సీహెచ్‌సీలో నిర్వహించనున్నట్లు ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ అల్లాడి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ సభ్యులు, ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది అందరూ హాజరుకావాలని సూపరింటెండెంట్ కోరారు.

నేత్రదానం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో మూల్పూరి వెంకటేశ్వరమ్మ(76) సోమవారం మృతి చెందారు. ఆమె కోరిక మేరకు తన భౌతికఖాయం నుంచి నేత్రాలను దానం ఇచ్చినట్లు గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. దీంతో ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్‌కు చెందిన సిబ్బంది ఆమె నేత్రాలను సేకరించి భద్రపరుస్తారని పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి ఆ భద్రపరచిన నేత్రాలను అమరుస్తారని తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వైఎస్సార్ సీపీ నాయకులు

నందివాడ: నందివాడకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ముక్కు కృష్ణ అనారోగ్యంతో ఆదివారం రాత్రి మతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, కష్ణా జిల్లా జనరల్ సెక్రెటరీ కందుల నాగరాజు, ఎంపీపీ పెయ్యల ఆదాం సోమవారం పరామర్శించారు. కృష్ణ కుటుంబానికి అండగా ఉంటామని నాయకులు తెలిపారు. నాయకులు కొండపల్లి రంగారెడ్డి, తోట నాగరాజు, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ వివరాలు సరిచూసుకోండి

ముదినేపల్లి రూరల్: మండలంలో రబీ పంటగా మినుము సాగు చేసిన రైతులు తమ ఈ-క్రాప్‌కు సంబంధించి నమోదైన వివరాలు సరిచూసుకోవాలని వ్యవసాయాధికారి బి వేణుమాధవ్ కోరారు. కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ సాగుకు సంబంధించి అన్ని గ్రామాల్లోని రైతుల వివరాలు ఈ-క్రాప్‌లో ఈ నెల 14వరకు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ వివరాలను స్థానిక రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించినట్లు తెలిపారు. రైతులు ఈ జాబితాలను చూసుకుని ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 19 లోపు స్థానిక వ్యవసాయ సహాయకులకు తెలియజేసి సవరణలు చేయించుకోవాలన్నారు. అభ్యంతరాలు పరిశీలించిన తరువాత తుది జాబితాను ఈ నెల 22న ప్రదర్శిస్తామని తెలిపారు.

బస్ స్టాప్ ఎదుట వైన్ షాపు పెట్టొద్దు



తహసీల్దార్ రంగారావుకు వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్ సమీరా

పెదపారుపూడి: పెదపారుపూడి ప్రధాన సెంటర్‌లో బస్ స్టాప్ ఎదురుగా వైన్ షాపు పెట్టొదని గ్రామ సర్పంచ్ చప్పిడి సమీరా సోమవారం తహసీల్దార్ వై.రంగారావుకు వినతి పత్రం అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గీత కులాలకు సంబంధించిన వచ్చిన షాపు బస్ స్టాప్ ఎదురుగా ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇక్కడ బస్ ఎక్కేందుకు మహిళలు వస్తుంటారని పేర్కొన్నారు. వైన్ షాపు ఉండటం ద్వారా ఇబ్బందులు వస్తాయన్నారు. వైన్ షాపు బస్ స్టాప్ ఎదురుగా లేకుండా చేయాలని తహసీల్దార్‌ను కోరారు.

ఆలయాల హుండీల లెక్కింపు

కైకలూరు: గ్రామంలోని పలు ప్రముఖ ఆలయాల్లో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను దేవదాయశాఖ గుడివాడ తనిఖీ అధికారి వి.సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్ మాట్లాడుతూ శ్రీ శ్యామలాంబ అమ్మవారి దేవస్థానానికి 132 రోజులకుగాను హుండీ ఆదాయం రూ.3,25,612, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి 178 రోజులకు రూ.48,927, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి 178 రోజులకు హుండీ ఆదాయం రూ.1,64,099 వచ్చిందని పేర్కొన్నారు.

అంబరాన్నంటిన వీరమ్మ తల్లి పునః ప్రతిష్ట సంబరాలు



కాంతులీనుతున్న అమ్మవారి దేవస్థానం



చిత్తర్వుతో పాటు దుక్కిపాటి, పాలేటి, శాయనను సన్మానించిన ఆలయ కమిటీ వారు

గుడ్లవల్లేరు: నూతనంగా నిర్మించిన శ్రీ వీరమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి పునః ప్రతిష్ట మహోత్సవ సంబరాలు సోమవారం అంబరాన్నంటాయి. కొలిచిన భక్తులకు కొంగు బంగారమైన శ్రీ వీరమ్మ తల్లి అమ్మవారిని విశ్వసించిన వేలాది మంది భక్తులు ఆ దేవస్థానానికి రావటం వలన మామిడికోళ్లకు వందేళ్ల నాటి నుంచి ఖ్యాతిని ఆ అమ్మవారు తెచ్చి పెట్టారని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ స్టేట్ మాజీ కన్వీనర్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది చిత్తర్వు నాగేశ్వరరావు కొనియాడారు. చిత్తర్వుతో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, ఎన్టీఆర్ స్టేడియం మాజీ వైస్ చైర్మన్ పాలేటి చంటి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శాయన రవి, నాయకులు చావా నాగేశ్వరరావు, చావా కిశోర్, పామర్తి రామ్మోహన్, రవిశంకర్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. వారిని ఆలయ కమిటీ వారు సన్మానించారు. శిఖర ప్రతిష్టతో పాటు భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ వంశ పారంపర్య నిర్వాహకుడు మండా రాంబాబు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు జెట్టి శ్రీరాం, చావా నాగేశ్వరరావు, కూసం హనుమప్రసాద్, తోట ఈశ్వరరావు, వెంకటేశ్వరరావు, నరేంద్ర, మల్లికార్జునరావు, చిత్తర్వు కౌశిక్, చావా సుభాష్ పాల్గొన్నారు.

కాంతులీనుతున్న వీరమ్మ తల్లి సన్నిధి

మామిడికోళ్ల శ్రీ వీరమ్మ తల్లి అమ్మవారి ప్రతిష్ట మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మ సన్నిధి విద్యుద్దీపాలంకణతో కాంతులీనుతోంది. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని వీరమ్మ సన్నిధిలో అమ్మవారి ఆకృతితో విద్యుద్దీపాల భారీ కటౌట్ భక్తులను ఆకట్టుకుంటోంది.

ఘనంగా పోలేరమ్మ జాతర



జాతరలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, పేర్ని కిట్టు, ఉప్పాల రాము తదితరులు

కైకలూరు: కలిదిండి మండలం పెదలంకలో పోలేరమ్మ జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ జాయింట్ సెక్రటరీ ఐనాల బ్రహ్మాజీ ఆధ్వర్యంలో విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ నాయకులు పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), ఉప్పాల రాము ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. తొలుత వారు అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం సామూహిక విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కలిదిండి మండల అధ్యక్షుడు తిరుమని రమేష్, నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షుడు కొల్లాటి సత్యనారాయణ, పెదలంక గ్రామ అధ్యక్షుడు ముద్దం రంగబాబు, కొండంగి ఎంపీటీసీ ఇమ్మనేని లక్ష్మణరావు, ఐనాల సత్యనారాయణ, దుగ్గిరాల రమేష్, నాగేశ్వరరావు, సాయిబాబా, రమేష్, సతీష్, నాగు, నాగరాజు, మర్రాజు, ముద్దం రామకృష్ణ పాల్గొన్నారు.

స్త్రీ వ్యక్తిత్వాన్ని వివరించిన మొల్ల



శేషారత్నంను సత్కరిస్తున్న భారతీ సమితి సభ్యులు

గుడివాడ టౌన్: స్త్రీ యొక్క వ్యక్తిత్వాన్ని సమాజానికి తేటతెల్లం చేసిన మహాకవయిత్రి మొల్లమాంబ అని విజయవాడ సిద్ధార్థ కళాశాల అధ్యాపకురాలు గోవాడ శేషారత్నం అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మొల్ల రచించిన రామాయణం , సాహిత్యాలపై సోమవారం సదస్సు నిర్వహించారు. రామాయణంలో సీతతో పాటు అందులోని పలువురు మహిళల వ్యక్తిత్వాన్ని, మానసిక స్థితిని ఆమె వివరించారన్నారు. మహిళలు తమకు ఇష్టం లేకపోతే విభిన్నమైన భావాలను వ్యక్తం చేస్తారని, సీత పాత్ర ద్వారా మొల్ల తెలియజేశారన్నారు. అనంతరం గోవాడ శేషారత్నంను సత్కరించారు. కార్యక్రమంలో భారతీ సమితి అధ్యక్ష, కార్యదర్శులు డీఆర్‌బీ ప్రసాదు, ఎం. మాధవరావు, సమితీ సభ్యులు వి.వి.రాఘవాచారి, అవిర్నేని వెంకటేశ్వరరావు, జన్ను చిరంజీవి, సీహెచ్. రూప, ఎన్. దీవెన, సీహెచ్. శకుంతల, తాతా పద్మలత, రాజకుమారి, కె. సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com